# చరిత్రకెక్కిన చరితార్థులు

# భద్రాచల రామదాసు

- వాసంతి మాఘుపు.

**'అదిగో భద్రాద్రి ... ఇదిగో గౌతమి చూడండి'** అన్న కీర్తన వింటే సాక్షాత్తూ భద్రాచలం దర్శించినంత ఆనందం కలుగుతుంది. ఆ కీర్తనలోని ప్రతి పదంలోనూ ఆర్ద్రత నిండి, భక్తి పారవశ్యం పొంగగా కీర్తనగా ఆవిర్భవించింది. ఈ కీర్తనను భద్రాచల రామదాసుగా, భక్త రామదాసుగా పేరుపడ్డ కంచర్ల గోపన్న వ్రాసినదని మనము విశ్వసిస్తాము. అయితే దానిని సాక్షాత్తూ శ్రీరామ చంద్రుడే తన చేత వ్రాయించాడని, తనను ఓ సాధనముగా ఉపయోగించుకున్నాడని ఆయన అనడం - రామునిపై అతనికి గల భక్తిని తెలియజేస్తుంది. చాలామందికి కష్టములలోనే భగవంతుడు గుర్తుకు వస్తాడు. కాని సర్వకాల సర్వావస్తలయందు భగవంతుని ధ్యానించడం ఏ కొందరికో సాధ్యం. అలాంటి ఉత్తములలో రామదాసు ఒకరు.

అందమైన ఆభరణము తయారుకావడానికి ముందు బంగారము కూడా కొలిమిలోని వేడి, సమ్మెట పోట్లు భరించవలసిందేకదా! అలాగే భక్తులకు కూడా కష్టములు తప్పవని, అవి జీవన్ముక్తికి సోపానములని తెలియజేస్తాయి. గోపన్న జీవితముగురించి కాస్త తెలుసుకుని, వారి జీవన సందేశాన్ని మన కనుగుణంగా మలచుకుని, ముముక్షువుల కోవలోకి ఏ ఒక్కరు చేరినా అది విశ్వకళ్యాణానికి దోహదం చేస్తుందని నమ్ముతూ మీకోసం ఈ కానుక.

గోల్కొండ సామ్రాజ్యాన్ని తానీషా పరిపాలిస్తున్న రోజులవి. అక్కన్న, మాదన్నలు మంత్రులుగా, రాజ్యాన్ని రాగద్వేషాలకు అతీతంగా, తమ బాధ్యతను నిర్వర్తించసాగారు. వారి మేనల్లుడు గోపన్న. గోల్కొండ సామ్రాజ్యంలో 'నేలకొండపల్లె' గ్రామంలో లింగన్న, కామాంబల పుణ్యాలపంటగా గోపన్న జన్మించాడు. 'కంచర్ల' ఇంటిపేరు. బాల్యంనుండే శ్రీరామచంద్రమూర్తిపై అచంచలమైన భక్తి ప్రపత్తులు గోపన్నకి ఏర్పడ్డాయి. ఒకసారి ఓ పండితుడు రామాయణమును పురాణముగా వినిపిస్తున్న తరుణములో గోపన్న "అయ్యో! నేను శ్రీరాముని కాలములో జన్మించక పోతినే. సుగ్రీవుడు, హనుమంతుడు మొదలైన వారితో కూడి శ్రీరాముని సేవించ లేకపోతిని గదా!" అని చింతిస్తుండేవాడు. యుక్తవయస్సు రాగానే కమలాంబ అనే సౌభాగ్యవతితో వివాహము జరిగింది. భార్య సహచర్యముతో గృహస్థ ధర్మమును ఆచరిస్తూ, రఘురాముడు అనే కుమారునికి తండ్రి అయ్యాడు. ఒకసారి కబీరుదాసు అనే భక్తుడు, గోపన్న ఆతిథ్యాన్ని స్వీకరించి, అతనికి తారక మంత్రోపదేశాన్ని చేయగా "తారక మంత్రము కోరిన దొరికెను ధన్యుడనైతిని" అని ఆనందాన్ని వ్యక్తీకరించాడు.

కొంత కాలానికి తల్లిదండ్రులు దివంగతులు కాగా, వారి ద్వారా సంక్రమించిన ఆస్తిని దానధర్మాలకు వినియోగించి, నిర్ధనుడై కుటుంబపోషణ కూడా కష్టంగా పరిణమించిన తరుణములో,

అక్కన్న మాదన్నలు గోపన్నకు ఏదైనా ఉద్యోగం ఇప్పించవలసినదిగా తానీషాను ప్రార్థించారు. గోపన్న గుణగణాలను మెచ్చిన తానీషా అతనిని భద్రాచలప్రాంతమునకు తహసీల్దారుగా నియమించాడు. రామ చరణాలనే నమ్మిన గోపన్న ప్రభుత్వ ఉద్యోగానికి ఇష్టపడక పోయినా, అక్కన్న మాదన్నలు అతనికి నచ్చజెప్పి ఒప్పించారు.

తహసీల్దారు పదవిని చేపట్టినా ఏ మాత్రమూ దర్పమును ప్రదర్శించక, విధి నిర్వాహణను చక్కగా చేయసాగాడు. అనంతరము నేలకొండపల్లెలో ఆగిపోయిన అన్నదాన కార్యక్రమము తిరిగి ప్రారంభించాడు. ఒకసారి అన్నదాన కార్యక్రమంలో కమలాంబ, గోపన్నలు పనిలోనుండగా వారి కుమారుడు వేడి గంజి గుంటలో పడి ప్రాణాలు విడిచాడు.ఈ విషయం ఆలస్యముగా కమలాంబకు, గోపన్నకు తెలిసింది. గోపన్న పుత్రుని మృతదేహమును తీసికొని భద్రాద్రిపై వెలసిన రాముని ఆలయానికి చేరి, రాముని పాదముల చెంత కుమారుని మృతదేహమును ఉంచి "అనాథ రక్షకా! రామచంద్రా! నిన్నే నమ్ముకున్నవాడిని. నీవే నా కుమారుడు రఘురాముని రక్షించకపోతే, నీ భక్తులకు దిక్కెవరు?" అని ఆర్తితో వేడుకోగా, కొద్దిసేపటికి ఆలయం తలుపులు తెరచుకొని రఘురాముడు బయటికి వచ్చి, తల్లిదండ్రులకు నమస్కరించెను. అలాంటిది గోపన్న భక్తి.

చిన్న మందిరము మాత్రమే ఉన్న రాముని ఆలయమును - పెద్ద ప్రాంగణము, గోపురములను నిర్మించి, ఆభరణములు సమకూర్చి - అభివృద్ధి చేయాలనే తలంపు కలిగింది గోపన్నకి. తానీషాకు పంపవలసిన పన్నులు వసూలు చేస్తూ, దేవాలయ నిర్మాణానికి చందాలు ప్రోగు చెయ్యడం మొదలుపెట్టాడు. పంటలు సరిగా పండని కారణముచేత, పన్నులనే అతి కష్టముపై చెల్లించే రైతులు - ఎక్కువగా చందాలు ఇచ్చే స్థితిలో లేకపోవడమువలన గోపన్న ఆలోచనలకు రూపము ఏర్పడలేదు. తన జీవితకాలములో రామచంద్రుని ఆలయమును వైభవముగా తీర్చిదిద్దడమనేది జరుగుతుందో లేదో అనే దిగులు వెంటాడసాగింది. ఇక తానీషాకు పంపవలసిన, పన్నుల ద్వారా వసూలైన సొమ్మును దేవాలయ గోపుర నిర్మాణానికి, ఆభరణములకు వెచ్చించి తన ఆలోచనలను అమలుపర్చాడు. ఈ విధముగా భద్రాచల దేవాలయము నిర్మాణము, నవరత్నాలతో కూడిన ఆభరణముల తయారీ వేగాన్ని అందుకున్నాయి. ఈ కార్యక్రమానికి ఎంతగానో తపించిన గోపన్నను ప్రజలు రామదాసు అని పిలవడం ప్రారంభించారు. అదే సార్థకనామముగా నేటికీ అందరి నోటా వినబడుతున్నది.

గోపన్నకు లభిస్తున్న జనాదరణను సహించలేని కొందరు అసూయాపరులు గోల్కొండకు పోయి, 'గోపన్న పన్నులద్వారా వసూలైన సొమ్మును దేవాలయ నిర్మాణానికై వెచ్చిస్తున్నాడని, తన ఉద్యోగ బాధ్యతను కూడా విస్మరిస్తున్నాడని, అతనిని విచారించి తగిన రీతిన శిక్షించమని' తానీషాకు ఫిర్యాదు చేసారు. సహజంగా తానీషా పరమతసహనముగల పాలకుడు కావడమువలన గోపన్న చేసినది అతనికి తప్పుగా తోచలేదు. కాని, ప్రభుత్వ ధనము వెచ్చించే ముందు తనకు తెలియబరచక పోవడము వలన రామదాసును దండిచవలసిన అగత్యం ఏర్పడింది. పైగా రామదాసును శిక్షించకపోతే ఇతర అధికారులు

కూడా ప్రభుత్వధనాన్ని దుర్వినియోగంచేసే అవకాశము ఉన్నందున, మంత్రులందరి తీర్మానము మేరకు, రామదాసును బంధించి గోల్కొండకు తీసుకురమ్మని ఆజ్ఞ జారీ చేసాడు తానీషా. భటులద్వారా ఈ వార్త విన్న రామదాసు ప్రశాంతత ఏమాత్రమూ భంగము వాటిల్లలేదు. రాముని భక్తుల రక్షణ భారము రాముడే స్వయముగా వహిస్తాడని నమ్మిన రామదాసు నిర్భయముగా భటులను అనుసరించాడు.

ఆపదామపహర్తారం దాతారం సర్వసంపదామ్ ।
లోకాభిరామం శ్రీరామం భూయోభూయో నమామ్యహమ్ ॥

వ్యక్తిగా తానీషా రామదాసును శిక్షించడం ఇష్టంలేకపోయినా, రాజుగా రాగద్వేషాలకు అవకాశము ఇవ్వరాదు కనుక, న్యాయాధికారులు రామదాసుపై నేరారోపణా పత్రాన్ని చదవడానికి అనుమతించాడు. "గోల్కొండ పాలకులు తనీషా వారి అనుమతిని పొందకుండా, ప్రభుత్వధనం ఆరు లక్షల వరహాలను దేవాలయనిర్మాణానికి భద్రచలం తహసీల్దారు కంచర్ల గోపన్న వెచ్చించిన కారణముగా, చట్టాన్ని ధిక్కరించినందులకుగాను అతనిని శిక్షించవలసినదని" అధికారులు ప్రకటించారు. తానీషా రామదాసునుద్దేశించి "ఈ నేరారోపణ విషయములో నీవేదైనా చెప్పుకోవలసినది ఉన్నదా?" అని ప్రశ్నించాడు. సభకు హాజరైన ప్రతివ్యక్తి రామదాసు ఏమి చెబుతాడో అని ఎదురుచూడసాగారు. రామదాసు గంభీరముగా "గోల్కొండ ప్రభువులు తానీషా నవాబులకు వందనాలు. నేను ప్రభుత్వ ధనాన్ని దేవాలయ నిర్మాణానికై వెచ్చించిన మాట వాస్తవం. మీవంటి ప్రభువుల పరిపాలనలో భద్రాచలంలో వెలసియున్న సీతారామస్వామివారి దేవాలయము సరియైన నిర్మాణము లేకపోవడం వెలితిగా తోచి, ప్రజలందరికి ఆమోదయోగ్యముగా ఆ నిర్మాణకార్యమును తమ ప్రతినిధిగా తలపెట్టితినని, తమురు అది సముచితము కాదని తలంచినయెడల తమరేశిక్ష విధించిననూ సమ్మతమేనని" విన్నవించుకొన్నాడు.

రామదాసు నిర్భయముగా పలికిన పలుకులకు అంతా ఆశ్చర్యచకితులయ్యారు. తానీషా తీర్పునిస్తూ, "ముందుగా అనుమతి తీసుకోకుండా ప్రభుత్వ ధనమును వెచ్చించడం నేరముగా పరగణిస్తూ, రామదాసుకు జైలు శిక్షవిధిస్తున్నానని" తెలియజేయగా, రామదాసు అధికారులవెంట చెరసాలకు బయలుదేరాడు. చెరసాలలో ఇచ్చిన ఆహారమునే రామచంద్రునికి నివేదనచేసి, దానిని ప్రసాదముగా స్వీకరించేవాడు. జైలులో అధికారులు ఎన్నిరకములుగ బాధించినా, శ్రీరామచంద్రుని ధ్యానిస్తూ "రామచంద్రా! అనాథరక్షకా! పాహిమాం!" అని శరణుజొచ్చేవాడు. భగవత్కృపవలన బాధలన్నీ మరుక్షణములో తొలగిపోయేవి. జైలులో గడిపిన కాలములో ఒక్కొక్కసారి రామచంద్రుని స్తుతిస్తూ, బాధకలిగినపుడు ఒక్కొక్కసారి బాధను భరించలేక నిందిస్తూ, తరువాత కాస్త ఉపశమనం పొందిన తరువాత బాధలను తట్టుకోలేక తిట్టితినని, రామదాసు కీర్తనలరూపములో జైలు గోడలపై బొగ్గుముక్కతో వ్రాసెడివాడు. "**సీతారామస్వామీ! నేచేసిన నేరంబేమి?**" అని తనకు కలిగిన కష్టాలకు కారణము చెప్పమని రామచంద్రునే నిలదీయడం ఆయనకే చెల్లింది.

జైలులో ఉండడము వలన రాముని దర్శించుకునే అవకాశములేక "శ్రీరామచంద్రా! నేను బందిఖానాలో చిక్కుకుని నీ సన్నిధికి రాలేకపోతున్నాను. కరుణించి నీవైనా నాకు సాక్షాత్కరించి నన్నునుగ్రహించరాదా?" అని వేడుకుంటూ **"పలుకే బంగారమాయేనా? కోదండపాణి పలుకే బంగారమాయేనా?"** అంటూ చిన్నబుచ్చుకుంటాడు. ఒకసారి విసుగు పుట్టి **"కలికితురాయి నీకు పొలుపుగజేయిస్తి రామచంద్రా నీవు కులుకుచు తిరిగేవు ఎవడబ్బసొమ్మని రామచంద్రా"** అని నిందిస్తాడు.రామదాసును ఎన్నిరకములుగా బాధించినా అతను ఆ బాధలన్నిటిని సహించగలిగాడంటే అతనికి దైవ సహాయం తప్పక అందుతోందని నమ్మిన తానీషా తానే స్వయంగా రామదాసును చూడాలని సంకల్పిస్తాడు. తానీషా రాకను గమనించిన రామదాసు **"రాముడు రక్షకుండు రఘురాముని నమ్మినబంటునేను - నాకేమి భయంబు చింతయికనేటికి"** అని రామునిపై తనకు గల విశ్వాసాన్ని తెలియజేస్తాడు.రామదాసు వంటి భక్తుని బాధించడమువలన తాను తప్పుచేస్తున్నాననే భావన కలిగి, రామదాసును ఎటులైనా విడుదల చేయించాలని తలపు కలిగింది తానీషాకి.

అక్కడ రాజభవనములో తానీషా వేదనకు గురికాగా, ఇక్కడ జైలులో రామదాసు **"పాహిమాం శ్రీరామా అంటే పలుకవైతివి రామా"** అంటూ **"ఇక్ష్వాకు కులతిలక ఇకనైనా పలుకవె రామచంద్రా! నీవు రక్షింపకున్నను రక్షకుడెవరయ్య రామచంద్రా!!"** అని రాముని వేడుకుంటూ, చివరకు ఆర్ద్రతతో **"నను బ్రోవమని చెప్పవే సీతమ్మతల్లి నను బ్రోవమని చెప్పవే - నను బ్రోవమని చెప్పు నారీ శిరోమణి జనకుని కూతుర జనని జానకమ్మ"** అని సీతాదేవిని ప్రార్థిస్తాడు.

రామదాసు చెరసాలలో ఓర్పునశించి విషం త్రాగడానికి నిశ్చయించుకుంటాడు. రామలక్ష్మణులు రామదాసు మొరవిని ఆరు లక్షల వరహాలు తానీషాకు జమచెయ్యడానికి సిద్ధమయ్యారు. తానీషా అదేరోజు - రామదాసు చెల్లించవలసిన ఆరు లక్షల వరహాలను ఎవరో దివ్యపురుషులు చెల్లించి రామదాసును విడిపించినట్లు - కలగంటాడు. ఉదయముననే ఎవరో ఇద్దరు వ్యక్తులు, తాము భద్రాచలం తహసీల్దారు రామదాసు సేవకులమని చెప్పి, ఆరు లక్షల వరహాలను సమర్పించి, రసీదు తీసుకుని అచటనుండి నిష్క్రమించారు.

త్రికరణశుద్ధితో (ఆలోచించేది, చెప్పేది, చేసేది ఒకటిగా) పనులు చేసేవారు అరుదుగా ఉంటారు. 'పరోపదేశ వేళాయాం సర్వే వ్యాసపరాశరా:' అన్నట్లు సలహాలు ఇచ్చే సమయములో ప్రతివారూ వ్యాసుని, పరాశరుని అంతవారుగా భావిస్తుంటారు. కాని ఆ సలహాలను ఆచరణలో పెట్టి చూపించడం మహాత్ములకే చెల్లుతుంది. **"శ్రీరామ నీనామ మేమిరుచిరా! ఓ రామ నీనామ మేమి రుచిరా! పాలుమీగడలకన్న పంచదార చిలకకన్న"** అని అక్షరముల నమ్మి, ఆచరించి చూపి, ఆ నామామృతమును గ్రోలిన రామదాసు ధన్యుడు. ఆయన కీర్తనలు అజరామరము.

శ్రీరాఘవం దశరథాత్మజమప్రమేయం - సీతాపతిం రఘుకులాన్వయ రత్నదీపం ।
ఆజానుబాహు మరవిందదళాయతాక్షం - రామం నిశాచర వినాశకరం నమామి ॥

***